
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 90 వ భాగం

### వృత్రాసుర వృత్తాంతం – 14, చిత్రకేతూపాఖ్యానం-2

క్రితం వ్యాసంలో చిత్రకేతుకి పుట్టిన కుర్రాడు చనిపోతే ఆయన ఏడుస్తున్నప్పుడు నారదుడు వచ్చి పోయిన కుర్రాడి ఆత్మని మళ్ళీ వచ్చి శరీరంలో ప్రవేశించి తల్లి తండ్రులకి సంతోషం కలిగించమన్నాడని చదివాం. పిలిస్తే వచ్చిన ఆ కుర్రాడి ఆత్మ ఇప్పుడు నారదుడితో అంటోంది.

తే. కర్మవశమున నెందు సుఖంబు లేక
దేవతిర్యఙ్నృ యోనులఁ దిరుగు నాకు
వెలయ నే జన్మమందునొ వీరు తల్లి
దండ్రు లయినారు చెప్పవే తాపసేంద్ర! [6-462]

"నేను ముందు చేసుకున్న కర్మ వల్ల ఎన్నో దేవతల, మానవుల, పశుపక్ష్యాదుల గర్భాలలో జన్మించి నానా కష్టాలు పడ్డాను. ఆయా జన్మాలలో నా తల్లిదండ్రులు ఎందరెందరో ఉన్నారు.  మరి ఈ తల్లిదండ్రుల దుఃఖం తీరిస్తే ఆ పాత తల్లిదండ్రుల మాట ఏమిటి? వీరు ఎవరు, ఏ నాటి తల్లిదండ్రులు?

దీని గురించి ఓ సారి ఆలోచిస్తే తెలిసేదేమంటే, ఒకసారి శరీరంలోంచి ఆత్మ బయటకి పోగానే దానికి మరో శరీరం ఆలంబన అవుతుంది. ఈ చనిపోయిన శరీరంలోకి వస్తే రెండు కష్టాలు. మొదటిది – కొత్త శరీరం వదిలి వెనక్కి రావాలి అంటే కొత్త ప్రాణి చనిపోవాలి. అప్పుడు అక్కడ కొత్త తల్లి తండ్రీ ఏడుస్తారు కదా? రెండోది ఇక్కడ శరీరంలో ప్రవేశిస్తే ఇలా రాగలుగుతున్నాడు కనక ఇప్పటికంటే ముందు ఉన్న శరీరాల్లోకి కూడా రమ్మని ఆ పాత తల్లి తండ్రులు అడుగుతారు. వాళ్ళెక్కడున్నారో, తానెక్కడున్నాడో? ఇదంతా అలా సులభంగా తేలే వ్యవహారం కాదు కదా?

తే. బాంధవజ్ఞాతిసుతులును బగతు రాత్మ
వరు లుదాసీన మధ్యస్థ వర్గములును
సరవిఁ గనుచుందు రొక్కొక్క జన్మమునను
నెఱయఁ బ్రాణికి నొక వావి నిజము గలదె? [6-463]

ప్రతీజీవికి బంధువులు, జ్ఞాతులూ, సుతులూ అంటూ అనేకమంది తగుల్తారు జీవితంలో, ఒక్కొక్క జన్మలో ఒక్కోవిధంగా. కర్మ తీరిపోగానే ఎవరి దారి వారిది. అంతేగానీ ఒక జీవికి పరమాత్మతో తప్ప ఎవరితోనూ బంధుత్వం లేదనేది నిజం. ఈ పద్యంలో బంధుత్వం అనేది ఎక్కడుందో చెప్పండి చూద్దాం. వావి – బంధుత్వం. వావి, వరుసా అంటారు కదా? అలాగన్నమాట.

తే. రత్నములు హేమములు ననురాగలీల
నమ్మకంబుల నీవల నావల నగు
భంగి నరులందు జీవుండు ప్రాప్తుఁ డగుచు
నెలమిఁ దిరుగుచు నుండుఁ; దా నెందుఁ జెడఁడు. [6-464]

అమ్మకం జరుగుతున్నప్పుడు క్రయ విక్రయాయలో రత్నాలూ, బంగారం అటూ ఇటూ మారుతూ ఉంటాయి. అలాగే కర్మానుసారంగా జీవుడు అటూ ఇటూ శరీరాలు మారుస్తూ ఉంటాడు కానీ ఆత్మకి ఎవరితోనూ బంధంలేదు. ఆ శరీరాల వల్ల ఆత్మకి మార్పూ లేదు. అంటే ఆత్మకి కర్మ అంటుకోదు. శరీరానికే ఈ బాధలన్నీ.

క. సతు లెవ్వరు? సుతు లెవ్వరు?
పతు లెవ్వరు? మిత్రశత్రు బంధుప్రియ సం
గతు లెవ్వరు? సర్వాత్మక
గతుఁడై గుణసాక్షి యైన ఘనుఁ డొక్కనికిన్. [6-466]

అటువంటి ఆత్మకి – సర్వాత్మకి, గుణసాక్షికి, సతులు, సుతులు, పతులు, బంధుమిత్రులు అంటూ ఎవరూ లేరు. అందువల్ల ఈ తల్లి తండ్రులనబడేవారికీ, సర్వాత్మ స్వరూపుడినైన నాకూ ఏమీ సంబంధంలేదు. ఈ దుఃఖం మానుకుని భగవంతుణ్ణి గుర్తుపెట్టుకోండి, ఈ శరీరంలోకి నేను ప్రవేశించను," అని చెప్పి ఆ కుర్రాడి ఆత్మ వెళ్ళిపోయింది. ఇదే తత్వం మనం సరిగ్గా భగవద్గీతలో కూడా చూడవచ్చు – వాసాంసి జీర్ణాని యధా విహాయ, నవాని గృహ్ణాతి నరోపరాణి, తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ. (2.22); ననం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః నచైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుత (2.23).

ఆ కుర్రాడి ఆత్మే వచ్చి ఇలా అనేసరికి రాజుకీ పరివారానికీ కళ్ళు తెరుచుకున్నాయి. వెంఠనే నారదుణ్ణి గురువుగా ఒప్పుకుని మనసు భగవంతుడి మీద పెట్టడానికి తపస్సు ప్రారంభించాడు రాజు. అసలే మంత్రం ఇచ్చినవాడు నారదుడంతటి ముని. అది ఫలించకుండా ఉండదు కదా, అందువల్ల ఆ తపస్సు ఫలించి విద్యాధరులమీద అధిపత్యం, ఎక్కడికైనా వెళ్లగలిగే సిద్ధులూ కలిగాయి. ఇవే ధ్యానం చేసేటపుడు కలిగే అష్ట అణిమాసిద్ధులలో కొన్నింటిగా చెప్పుకోవచ్చు. వాటిని దాటితే భగవద్దర్శనం అవుతుందనుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో చిత్రకేతువుకి ఆదిశేషుడు కనిపించాడు, అద్భుతమైన అలంకారంతో, తన స్వరూపంతో.

ఆదిశేషుడు ఎవరూ ఎక్కడ ఉంటాడని ప్రశ్న వేసుకుంటే మనకి తెలిసేదేమంటే విష్ణువుని మోసే ఆయన ఆదిశేషుడు కనక, చిత్రకేతువు నారదుడిచ్చిన మంత్ర ప్రభావంతో దాదాపు విష్ణువు కనిపించేంతవరకూ ధ్యానంలో ముందుకెళ్ళాడు. మరో మెట్టు ఎక్కగలిగితే భగవంతుణ్ణి చూడవచ్చు – అంటే బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి (బ్రహ్మాన్ని చూసినవాడు బ్రహ్మమేఅవుతాడనే) ఉపనిషద్వాక్యం తెలుస్తుంది. చిత్రకేతువు కి ఆ బ్రహ్మాన్ని చూసే అంత ధ్యానం చేయగల సామర్థ్యం ఉందా? ఇప్పుడు ఆదిశేషుడితో అంటున్నాడు.

ఉ. నీ విభవంబు లీ జగము నిండుట యుండుట నాశ మొందుటల్
నీ విమలాంశజాతములు నెమ్మి జగంబు సృజించువార, లో
దేవ! భవద్గుణాంబుధుల తీరముఁ గానక యీశ! బుద్ధితో
వావిరిఁ జర్చ చేయుదురు వారికి వారలు దొడ్డవారలై. [6-473]

ఈ లోకాలు పుట్టడం, పెరగడం, నశించడం అనేవి నీ లీలా విలాసాలు (విమలాంశ జాతములు). ఈ జగాన్ని సృజించేవారు నీ అంశంవల్ల జన్మించినా నీ గుణ సముద్రంలో మునిగి తేలుతూ తీరం ఏదీ తెలియక తామే గొప్పవాళ్ళమనే భావంతో అధికంగా (వావిరి) చర్చలు జరుపుతున్నారు.

క. పరమాణువు మొదలుగఁ గొని
పరమము దుదిగాఁగ మధ్యపరికీర్తనచే
స్థిరుఁడవు త్రయీవిదుఁడవై
సరి సత్త్వాద్యంత మధ్య సదృశగతుఁడవై. [6-474]

పరమాణువు నుండి చివరి దాకా, ఈ మధ్యలోనూ నువ్వే అంతర్యామిగా (సదృశగతుడవై) నీవే అయి ఉన్న శాశ్వతుడివి (స్థిరుడవు), త్రయీవిదుడవు (వేదాలు తెల్సినవాడివి). ఇలా స్థుతించే సరికి ఇప్పుడు ఆదిశేషుడు సమాధానం చెప్తున్నాడు.

ఆ. అరయ నారదుండు నంగిరసుండును
దత్త్వ మొసఁగినారు; దాని కతన
నన్నుఁ జూడఁగల్గె నా భక్తి మదిఁ గల్గె
నా పథంబు నీకు నమ్మఁ గలిగె. [6-479]

నారదుడు, అంగిరసుడు నా తత్వం గురించి నీకు తెలియ చెప్పారు. ఆ విధంగా నీ మనసులో భక్తి కలిగి నా పథం ఏమిటో నీకు తెల్సింది. ఇవన్నీ చెప్పి అదృశ్యమయ్యాడు ఆదిశేషుడు. ఆదిశేషుణ్ణి చూసిన ఆనందంలో చిత్రకేతువు మరింత విష్ణుభక్తుడయ్యాడు.

మ. హరిఁ గీర్తించుచు నల్లనల్ల మదిలో నబ్జాక్షు సేవించుచుం
బరమానందము నొందుచున్ జగములం బ్రఖ్యాతి వర్తించుచున్
సురరాజోపమమూర్తి యక్షగణముల్ సొంపార విద్యాధరా
ప్సరసల్ గొల్వఁగఁ బాడఁగా సితగిరిప్రాంతంబునన్నేగుచున్. [6-487]

మనసులో విష్ణువుని సేవిస్తూ, కీర్తనం చేస్తూ, యక్ష గణాలు, విద్యాధరులూ తనని కొలుస్తూండగా పరమానందం పొందుతూ తిరుగుతున్నాడు. అలా హిమాలయాలకి (సితగిరి) దగ్గిరకి వచ్చాడు. గమనించారా? ఈ సిద్ధులూ, దర్శనాలూ అయినా ఇంకా పూర్తి భగవద్దర్శనం కాలేదు, అందువల్ల ఇంకా పొడిగించాడు తాను చేయాల్సినది. ఇంతమంది యక్షులూ విద్యాధరులూ ఉన్నారు కదా అని అక్కడే ఊరుకుంటే అప్పుడు ధ్యానంలో కదిలేది ముందుకి కాక కిందకి. అందువల్ల చిత్రకేతు వదలకుండా హరిభక్తితో ఉన్నాడు.

శా. ఆ విద్యాధరభర్త గాంచె హరనీహా రామృతాహాసమున్
శ్రీవిభ్రాజితమున్ నిరస్త గిరిజా సేవాగతాయాసమున్
దేవానీక వికాసమున్ శుభమహాదేవాంఘ్రి సంవాసమున్
భూవిఖ్యాత విలాసముం ద్రిభువనీ పూతంబుఁ గైలాసమున్. [6-488]

అలా హిమాలయాలకి వచ్చినప్పుడు కైలాసం కనిపించింది. ఆ కైలాసం ఎవరిది? శుభ మహాదేవాంఘ్రి సంవాసము. పరమేశ్వరుడు ఉండే చోటు. ఇంతకు ముందు చదివినట్టూ ఈ ప్రదేశంలోకి ప్రవేశించలేకే కదా బ్రహ్మ హత్యా పాపం ఇంద్రుడి కోసం వేచి చూచి నీరసపడింది? ఇదే ప్రదేశంలో శివుణ్ణి పార్వతి సేవించింది (గిరిజా సేవాగతాయాసము), ముల్లోకాలనీ పవిత్రం చేయగలగేది (త్రిభువనీ పూతంబు).

వ. ఇట్లు బ్రహ్మాది సురనికర సేవితుండై యూరుపీఠంబుననున్న భవానిం గౌగిటం జేర్చుకొని యొడ్డోలగంబున నున్న పరమేశ్వరుం జూచి చిత్రకేతుండు పకపక నగి యద్దేవి వినుచుండ నిట్లనియె. [6-491]

ఇలా చిత్రకేతువు కైలాసంలోకి వచ్చేసరికి అక్కడ శివుడి వడిలో కూర్చుని ఉన్న పార్వతీ దేవి కనిపించింది. చుట్టూ బ్రహ్మాది దేవతలూ, "అసలు భగవంతుడి స్వరూపం ఇలా ఉంటుంది, అలా ఉంటుందని" వాదించుకునే వేదాలూ, ప్రమథగణాలూ, ఇలా అనేకానేక దేవతలందరూ సేవిస్తూండగా పరమశివుడు కూర్చుని ఉన్నాడు కైలాసలో. ఇంతమంది ఉండగా అయినా సరే శివుడి వడిలో పార్వతి కూర్చోవడం చూసి చిత్రకేతువు పక పక నవ్వి ఇలా అన్నాడు.

శంకర భగవత్పాదులు శివానందలహరి మొదలు పెడుతూ ఇలా అంటారు.

కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటితఫలాభ్యాం భవతు మే
శివాభ్యా మస్తోక త్రిభువన శివాభ్యాం హృది పున
ర్భవాభ్యా మానందస్ఫురదనుభవాభ్యామ్ నతి రియం (శివానందలహైరి. 1)

అంటే పార్వతీ పరమేశ్వరులు ఒకరికొకరు, సమస్త విద్యాస్వరూపులుగా ఉగ్రమైన తపస్సు చేసి, లోకాలన్నింటికీ శుభదాయకులై కర్మప్రదాతలుగా ఒకటయ్యారు. అంటే అర్ధనారీశ్వరులు. అంతే గానీ ఒకరినొకరు పెళ్ళి చేసుకోవడం కోసం కాదు. వాళ్లని మనకున్న మలినమైన మనసులతో చూసి ఏదో ఊహిస్తే తప్పు కదా? నమస్సోమాయచ (నమః ఉమాయచ – ఉమా పతికి నమస్కారం), రుద్రాయచ .... అంటూ నమకం స్తుతించే ఈ భవానీ శంకరులు ఎటువంటివారో అక్కడున్న మునీశ్వరులకీ బ్రహ్మాది దేవతలకీ తెలియదా? వాళ్లు ఎందుకు మాట్లాడలేదు ఇలా పార్వతి శివుడి వడిలో కూర్చున్న విషయం? ఎందుకంటే వాళ్ళు మనకున్న మలినాలు వదిలించుకుని శివుణ్ణి, అమ్మవారినీ ఎక్కడ ఎలా కూర్చున్నారనే విషయం వదిలేసి భగవత్స్వరూపంగా, అర్ధనారీశ్వరులిగా చూడగలిగేరు. చిత్రకేతువో? ఆయనకి ఇంకా విషయవాసనలు వదలలేదు కాబోలు అందుకే నవ్వు వచ్చింది. మలినం మనలో లేకుండా అసలు అది మనకి బయట ఎలా కనబడుతుంది? బ్రహ్మజ్ఞానం రావాలంటే ఇవన్నీ అధిగమించాలి; ఇలా ఆదిశేషుణ్ణి చూడడం, పార్వతీ పరమేశ్వరులు కనిపించడం ఇదంతా అందులో ఓ భాగం. చిత్రకేతువు ఏమంటున్నాడంటే

సీ. కొమరొప్పఁగా లోకగురుఁడును గడలేని-
ధర్మస్వరూపంబుఁ దాన యగుచు
జడలు ధరించియు సరిలేని తపమునఁ-
బొడవైన యీ యోగిపుంగవులును
బ్రహ్మాదులుఁ గొల్వ భాసిల్లు కొల్వులో-
మిథునరూపంబున మెలఁతతోడఁ
బ్రాకృతుండునుబోలె బద్ధానురాగుఁడై -
లాలితుం డయ్యె నిర్లజ్జత నిట; [6-492]

ఆ. నకట! ప్రకృతిపురుషుఁ డైనఁ దా నేకాంత
మందు సతులతోడ నలరుఁగాని
యిట్లు ధర్మసభల నింతులతోఁగూడి
పరిఢవింపలేఁడు భ్రాంతి నొంది. [6-492.1]

లోకగురుడుట, ధర్మస్వరూపుడుట ఈ శివుడు; జడలు ధరించి తపస్సులో రాణించిన ఈ యోగిపుంగవులు, బ్రహ్మదేవుడితో పాటు అందరూ ఆయనని సేవిస్తున్న ఈ సభలో మామూలు మానవుడి లాగా (పాకృతుండును బోలె), అనురాగంతో, సిగ్గులేకుండా (నిర్లజ్జత నిట) పార్వతిని వడిలో కూర్చోపెట్టుకున్నాడు. మామూలు మానవుడు సైతం భార్యతో సరసాలు ఆడాలంటే ఏకాంతంలో ఉంటాడు కానీ ఇలా ధర్మ సభలోనా విచ్చలవిడిగా ప్రవర్తించడం?

చిన్న కథ దీని గురించి. పరమశివుడు ఎటువంటివాడు? ఓ చెంబుతో నీళ్ళు పోసి నమఃశివాయ అంటే ఏది కోరినా అది ఇచ్చేస్తాడు. అమ్మవారో? ప్రాణం పోతున్నప్పుడు శివుణ్ణి తల్చుకుంటే ఒకాయనకి శివలోకానికి వెళ్ళడానికి విమానం వచ్చిందిట. అందులో అమ్మవారు కూర్చుని ఉంది. అది కైలాసానికి వెళ్తూంటే అమ్మవారు పక్కకి తిరిగి కళ్ళు తుడుచుకుంటోందిట. శివుడు అడిగాడు, ఎందుకలా కళ్ళు తుడుచుకుంటోందో. "మోక్షం ఇచ్చాం కానీ వీడికి ఇంకేమీ ఇవ్వలేకపోతున్నాం కదా? అందుకే కన్నీళ్ళొచ్చాయి" అందిట. తల్లి మనసు అలా ఉంటుంది. అసలు భగవంతుడి గురించి, ఆయన ఇలా జటలు ధరిస్తాడు, నాకేమీ మర్యాద ఇవ్వలేదు అని దక్షుడు అనుకుని గర్వం పొందితే ఏమైందో చూశాం. ఇప్పుడు చిత్రకేతువు ఇలా పార్వతీ పరమేశ్వరులని చూసి నవ్వినందుకు ఆయన మూడో కన్ను తెరిస్తే ఏమౌతుంది? లేదా ఓ జట తీసి మరో వీరభద్రుణ్ణి పుట్టిస్తే చిత్రకేతువు ఏమౌతాడు? అయినా దేవతలని కాపాడ్డం కోసం కాలకూటాన్ని మింగి లోకాలని రక్షించిన శివుడి గురించి నోటికొచ్చినట్టూ వాగితే ఏమౌతుంది? ఆ విషయం పై నెల వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS